వావ్.. బోడుప్పల్ అనేలా..

పలు అభివృద్ధి పనులకు రూ.20 కోట్లు

- కొన్నింటికి టెండర్ ప్రక్రియ పూర్తి.. మరికొన్ని ప్రాసెస్‌లో..
- త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం..
- అధికారులు, పాలకవర్గం సమన్వయంతో ముందుకు..
- అన్ని పార్టీలతో కలిసి ముందుకెళ్తున్న మంత్రి మల్లారెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ సమగ్రాభివృద్ధికి రూ.20 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వాటిలో పలు పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించగా, మరికొన్ని పనులు టెండర్ ప్రాసెస్‌లో ఉన్నాయి. ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, పాలకవర్గం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర పాలక సంస్థ పరిధిలో అత్యవసర పనులను గుర్తించి, వాటిని ప్రయారిటీ ప్రకారం పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని డివిజన్‌ల్లో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

అభివృద్ధి పనుల్లో మూడున్నరేళ్లుగా స్తబ్దత..

గడిచిన మూడున్నరేళ్లుగా అభివృద్ధి పనుల్లో స్తబ్దత ఏర్పడింది. నగర పాలక సంస్థ ఏర్పడిన తర్వాత బోడుప్పల్‌లో ఆరుగురు కమిషనర్లు మారారు. ఇక్కడ పని చేసిన అధికారులు, పాలకవర్గం మధ్య సరైన సమన్వయం లేదు. దీంతో అభివృద్ధి విషయంలో పూర్తిగా కుంటుపడింది. అంతేగాకుండా పాలకవర్గం ఏర్పడిన తర్వాత రెండుసార్లు కరోనా రావడంతో ఆర్థిక వనరులు తగ్గడంతోపాటు అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది.

నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

బోడుప్పల్ నగర పాలక సంస్థను ప్రణాళికబద్ధంగా సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తొలుత అత్యవసర పనులను గుర్తించి వాటిని పూర్తి చేయడం, దశలవారీగా అన్ని డివిజన్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు పనులు చేపడుతున్నారు. పార్కులు, చెరువులు, ప్రకృతి వనాలను సుందరీకరించడం, వైకుంఠ ధామాలు, నర్సరీలు అభివృద్ధి చేయడం, పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు, తాగునీరు అవసరాలు తీర్చడం, మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నారు. ప్రజలకు మౌలిక వసతులే లక్ష్యంగా ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు.

24 గంటల్లో మ్యాన్‌హోల్స్ రిపేరు..

పాడై పోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను రిపేరు చేసేందుకు 'ఫ్రీడం ఫ్రం మిషన్ హోల్' పేరుతో ఫిర్యాదుల విభాగం చేపట్టారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లో రిపేరు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పగలిపోయిన మ్యాన్‌హోల్స్, పూర్తిగా కుంగిపోయిన, పూర్తిగా లేకపోయిన ఇందు కోసం కంట్రోల్ నంబర్- 040- 2721 5959కు గాని, రాతపూర్వకంగా గానీ ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదులు అందిన వెంటనే ప్రత్యక్షంగా సమస్య పరిష్కారం కోసం చొరవ తీసుకుని వెంటనే పూర్తి చేస్తారు.

త్వరితగతిన పనులు పూర్తిచేస్తాం



ప్రస్తుతం రూ.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో తీర్మానం చేసి ఆగిపోయిన పనులకు, ప్రస్తుతం నూతనంగా చేపట్టిన పనుల్లో కొన్నింటికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తున్నాం. మిగతా పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కోడ్ రాక ముందే పనులు ప్రారంభిస్తాం. పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు పని పూర్తి చేసిన వెంటనే బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో చెల్లిస్తాం. సకాలంలో పనులు పూర్తి చేయడం తోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతాం.

- జి.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ బోడుప్పల్

పట్టణ సేవలకు వార్డు అధికారులు

- వీఆర్‌ఏల సర్దుబాటులో పురపాలికల్లో వార్డు అధికారులు
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కొనసాగుతున్న పక్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో వార్డు అధికారులు(ఆఫీసర్లు) రానున్నారు. వీఆర్‌ఏల సర్దుబాటుతో పురపాలికల్లో వార్డు అధికారుల నియామకానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పట్టణ ప్రజల సౌలభ్యం కోసం వార్డు స్థాయిలోనే అన్ని సేవలు అందించాలంటే.. ప్రతి వార్డుకు ఒక అధికారి ఉండాలని భావించిన ప్రభుత్వం పురపాలికలకు వీరిని కేటాయించింది. ఇటీవల వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సర్కారు వారిని వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే ప్రతి డివిజన్‌లో వార్డు అధికారులను నియమించి వారి ద్వారా ప్రజల నుంచి అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరిస్తూ.. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో అన్ని పురపాలికల్లో కొనసాగించేందుకు అధికారుల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మొత్తంగా 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న డివిజన్లు, వార్డుల్లో వార్డు అధికారులను నియమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కొత్తగా వచ్చిన వార్డు సిబ్బంది వల్ల పట్టణాల్లో సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

సేవల మెరుగు కోసం..

పురపాలికలు అంటేనే విస్తరిస్తున్న పట్టణాలు.. వీటిలో సమస్యల పరిష్కారం కత్తిమీద సాములాంటిదే. మంచినీరు, విద్యుత్తు దీపాలు, పారిశుద్ధ్యం, పందులు, వీధి కుక్కలు తదితర సమస్యలపై స్థానికులు పుర కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. చాలా సందర్భాల్లో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండేది కాదు. ఆయా ఇబ్బందుల పరిష్కారానికి సమయం పట్టేది. పురపాలికలకు అనుబంధ కాలనీలు, పాత గ్రామాలు ఉంటే అక్కడి పరిస్థితి అంతే. ఈ క్రమంలో వార్డుల్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను నియమించాలని నిర్ణయించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు 225 వీఆర్‌ఏలను బదిలీ చేయగా, వార్డు అధికారులుగా నియమించారు. ఇందులో 131 మందికి నియామక పత్రాలకు కూడా జారీ చేశారు. 2022లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో పురపాలిక సిబ్బందిని వార్డు అధికారిగా నియమించారు. తాజాగా వార్డు అధికారిగా ప్రభుత్వ ఉద్యోగులు రానుండటంతో సేవలు మరింత మెరుగు పడగలవని ఆశిస్తున్నారు.

చేపట్టనున్న పనులివే..

పురపాలికల్లో వార్డు అధికారులకు పారిశుద్ధ్య సిబ్బందిని అనుసంధానం చేస్తారు. వారు కార్మికుల ద్వారా నీటి నిల్వలు తొలగించడం, పైపుల్లో ఆగిన చెత్తను తీసివేయడం, అక్రమ కట్టడాల కూల్చివేత, రహదారుల గుంతలు పూడ్చివేయడం, పశు కళేబరాల తొలగింపు వంటి పనులను చేయించాలి. ఇతర చోటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దివ్యాంగుల సంక్షేమం కోసం అక్కడే సేవలందిస్తారు. జనన, మరణ ధ్రువపత్రాలు వార్డులోనే అందించనున్నారు. ఆస్తి పన్ను వసూలు బాధ్యత వీరే చూడనున్నారు. ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వీరిదే. వార్డుల్లో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారు. కౌన్సిలర్, అధికారికి భవిష్యత్‌లో ప్రత్యేక గదులు కేటాయించనున్నారు. అక్కడ కౌన్సిలర్, వారి అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

మంత్రి మల్లారెడ్డికి శుభాకాంక్షలు



మేడిపల్లి: మంత్రి చామకూర మల్లారెడ్డికి రెండోసారి బీఆర్‌ఎస్ నుంచి టికెట్ కేటాయించడంతో బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ 14వ డివిజన్ కార్పొరేటర్ పాశం శశిరేఖ బుచ్చియాదవ్ మంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బాలనరసింహ, పోలీస్ తిరుపతిరెడ్డి, మద్దిశెట్టి ఎల్లయ్య, కోటయ్య, పాశం సత్యం యాదవ్, ఎనబోయిన శ్రీనివాస్, మంద మల్లేష్, పోలీస్ సరేందర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు, క్రిష్టియన్ మైనార్టీ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. ఎస్‌వీఎస్ కాలనీలో రూ.10 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పబ్బు సత్యనారాయణ, నాయకులు బాల్‌రెడ్డి, భిక్షపతి, చంద్రశేఖర్, పవన్, కుమార్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్‌గా అరవింద్



అల్వాల్: మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్‌గా ఏ.అరవింద్ బాబు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ జిల్లాలో జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అరవింద్ బుధవారం మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

బీజేవైఎం ఉప్పల్ కన్వీనర్‌గా గుమ్మిడెల్లి క్రాంతి



ఉప్పల్: బీజేవైఎం ఉప్పల్ నియోజకవర్గ కన్వీనర్‌గా గుమ్మిడెల్లి క్రాంతికుమార్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, గోరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, ధర్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

అల్వాల్: మానసిక సమస్యలతో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లాకు చెందిన అన్నమయ్య ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం తాను పనిచేసే చోట బ్రీఫింగ్ రూమ్‌లోకి వెళ్లి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్మీ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మందుబాబులకు జైలు

25 మందికి జరిమానా


తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శివశంకర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 25 మందికి ఐదో స్పెషల్ ఎంఎం కోర్టు జరిమానా విధించిందని ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. ఒకరికి పది రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా, మరొకరికి ఐదు రోజుల జైలు, జరిమానా, మరొకరికి రూ.2 వేల జరిమానా ఒక రోజు ట్రాఫిక్ సమాజసేవ చేయాలని, కొంతమందికి జరిమానా విధించిందని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం


అర్కల్‌గూడలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, మూడవసారి కేసీఆర్ సీఎం బాధ్యతలు చేపట్టడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ, అర్కల్‌గూడ, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠ దామం తదితర అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రూ.కోట్ల రూపాయల నిధులు వెచ్చించి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని, దీంతో గ్రామాల్లో ప్రజలు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుతున్నారన్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేయడంతో ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టి మూడవసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ దివాలా తీసిందని, బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో బీఆర్‌ఎస్ 100 సీట్లు గెలవడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి, రజిత వెంకటేశ్, రాజకుమారిసుధాకర్, ఆంతోనమ్మ, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, వీణ, ఫిలిప్స్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంచుతున్న ప్రభుత్వం

సాక్షి, మేడ్చల్ జిల్లా: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, వీరికి దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు కూడా అందజేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, అర్హులకు సక్రమంగా అందేలా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులకు రూ.3,016 నుంచి రూ.4,016లకు పెంచిన ఆసరా పింఛన్ ప్రారంభం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన 6,461 మంది దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన రూ.4,016 పింఛన్ ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఎంత చేసినా తక్కువేనన్నారు. ఇల్లు లేని దివ్యాంగులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. మొదటి ప్రాధాన్యత కింద అలాట్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్లు, సంబంధిత జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్‌కు శుభాకాంక్షలు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని బుధవారం బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారన్న ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు గడ్డం శ్రీనివాస్, పాండునాయక్, శాతం రమేష్, కుమార్, సాయికుమార్, బాలునాయక్, రవి, పరుశురాం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహాన్.. చంద్రయాన్..

రామంతాపూర్: ఏ నోట విన్నా.. ఏ ఫోన్ చూసినా.. ఏ ఇంట్లో టీవీ చూసినా.. ఒక్కటే చంద్రయాన్–3 గురించే.. బుధవారం సాయంత్రం చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్ కాగానే ఎక్కడ చూసినా సంతోషాలే.. ఎక్కడ నలుగురు కనిపించినా చప్పట్లతో శెభాష్ ఇస్రో అంటూ మెచ్చుకున్నారు. ప్రపంచ దేశాల ముందు భారత్ తలెత్తుకునేలా చేసిన సైంటిస్టులను అభినందించారు. బీజేపీ నేతలు పెద్ద చెరువు ఎదురుగా ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రేవు నరసింహ, నగేష్, సంతోష్, తిరుపతయ్య, ఆనంద్, రవి, లింగం, నరసింహారావు, మంగాగౌడ్, స్వర్ణ తదితరులు ఉన్నారు.


కట్ట మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మల్కాజిగిరి బీఆర్‌ఎస్ సీటు స్థానికులకే ఇవ్వాలి

బద్దం పరుశురాంరెడ్డి


మాట్లాడుతున్న బద్దం పరుశురాంరెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి బీఆర్‌ఎస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలని బీఆర్‌ఎస్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు, మల్కాజిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి బద్దం పరుశురాంరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాలనీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, పార్టీ అధిష్టానం మధ్య కొంత లొల్లి నడుస్తోందన్నారు. అధిష్టానం మైనంపల్లి హన్మంతరావుకు టికెట్ ఇస్తే కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ తమకు కాకుండా ఇతరులకు ఇస్తే ఒప్పుకోమన్నారు. పార్టీకి 20 సంవత్సరాలుగా కష్టపడి పని చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తమకు కాకుండా మర్రి రాజశేఖర్ రెడ్డి, శంబీపూర్ రాజులతో పాటు ఇతరులకు మల్కాజిగిరి అసెంబ్లీ సీటు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోందన్నారు. వారికి టికెట్ ఇవ్వకుండా మల్కాజిగిరిలో నివాసముంటున్న స్థానికులకే టికెట్ ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్, పాషా, పేపర్ శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, లక్ష్మీ, నూరి తదితరులు ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మనెంట్ చేయాలి


అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసనలో ఏఐటీయూసీ నాయకులు

అల్వాల్: జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించి పర్మనెంట్ చేయయాలని ఏఐటీయూసీ అల్వాల్ శాఖ నాయకులు అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేందర్, వెంకటేష్, తిరుపతి తదితరులు ఉన్నారు.

ఉప్పల్ నుంచి అవకాశం కల్పించాలి

గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేసిన రాగిడి లక్ష్మారెడ్డి


గాంధీభవన్‌లో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌కు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం గాంధీ భవన్‌లో దరఖాస్తును అందజేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తును సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందిస్తూ ప్రజల్లో ఉంటూ పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ అప్పజెప్పిన పలు బాధ్యతలను నిర్వర్తించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ బాధ్యతలను నిర్వర్తించి ప్రజల్లో ఉన్నట్లు తెలిపారు. దీంతో పాటు మధురా చారిటబుల్ ట్రస్టు ద్వారా 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు గుర్తు చేశారు. తనకు ఒక్క అవకాశం కల్పించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడల మల్లికార్జున్‌గౌడ్, పులిపాక అంజయ్య, సంజయ్ జైన్, వినోద్ ముదిరాజ్, షేక్ మాదర్ వలీ, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకే అధికారం

- అస్సాం లక్కింపూర్ ఎమ్మెల్యే మనబ్ డేఖ


చిలుకానగర్‌లో మాట్లాడుతున్న అస్సాం లక్కింపూర్ ఎమ్మెల్యే మనబ్ డేఖ

ఉప్పల్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అస్సాం లక్కింపూర్ శాసనసభ్యుడు మనబ్ డేఖ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం చిలుకానగర్‌లో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ విధాన్ సభ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని, అందుకు సంస్థాగతంగా పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కక్కిరేని చేతన, బండారు శ్రీవాణి, పద్మారెడ్డి, రవి నాయక్, దేవిసాని బాలచందర్, రావుల బాలకృష్ణ, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.